మనం
కడప | అన్నమయ్య

# రాజంపేట పుర పీఠంపై హైటెన్షన్!

పీఠం ఎవరి సొంతం?

బీసీ మహిళా రిజర్వేషన్‌తో మారిన సీన్..

కూటమిలో పెరుగుతున్న పొలిటికల్ హీట్!

జనసేన ఆఫీస్‌లో 'యల్లటూరు'తో సీక్రెట్ మంతనాలు.. పీఠం కోసం అమీతుమీ!

ఈసారి చైర్‌పర్సన్ స్థానం మనకే దక్కాలి

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 13: రాజంపేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో స్థానిక రాజకీయాల్లో ఒక్కసారిగా కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. గత కొంతకాలంగా పురపీఠంపై గంపెడాశలు పెట్టుకున్న అగ్రవర్ణ ఆశావహులకు రిజర్వేషన్ నిర్ణయం నిరాశ కలిగించగా.. బీసీ వర్గాల్లో మాత్రం కొత్త ఆశలు చిగురించాయి. పురపీఠం దక్కించుకునేందుకు అర్హత, సామాజిక బలం, పార్టీతో అనుబంధం ఉన్న మహిళా నేతల పేర్లపై ఆయా పార్టీల్లో చర్చ మొదలైనట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ మారింది.. రాజకీయ లెక్కలూ మారాయి అన్నట్లుగా రాజంపేటలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ?కూటమి అధికారంలో ఉండటంతో పురపీఠం ఎవరికి దక్కుతుంది? టీడీపీనా.. జనసేననా? అన్నదే ఇప్పుడు ప్రధాన రాజకీయ చర్చగా మారింది. అధికార టీడీపీ ఇప్పటికే పురపీఠంపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం సాగుతుండగా.. కూటమి భాగస్వామ్య పక్షమైన జనసేన కూడా తన వ్యూహాన్ని గోప్యంగా కొనసాగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తెరవెనుక మంతనాలు.. ఆశావహుల్లో ఉత్కంఠ.. అధిష్ఠానం నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. సామాజిక సమీకరణాలు, పార్టీ బలం, కూటమి అవగాహన.. ఈ మూడు అంశాలే చివరికి కీలకం కానున్న నేపథ్యంలో రాజంపేట పురపీఠం పగ్గాలు ఎవరికి దక్కుతాయన్నది ఉత్కంఠగా మారింది.

**ఆశావహుల వేటలో టీడీపీ.. సామాజిక బలంపై దృష్టి!**

పురపాలక సంఘంలో బలమైన క్యాడర్, విస్తృతమైన యంత్రాంగం కలిగిన తెలుగుదేశం పార్టీ ఈ అవకాశాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలని భావిస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచీ అండగా నిలిచిన సంప్రదాయ బీసీ ఓటు బ్యాంకును సంతృప్తి పరుస్తూనే, స్థానికంగా ఆర్థిక, అంగబలం కలిగిన కుటుంబాల నుంచి అభ్యర్థిని బరిలోకి దింపే యోచనలో నాయకత్వం ఉంది. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని పలువురు సీనియర్ నేతల భార్యలు, కుటుంబ సభ్యుల బయోడేటాలను నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వాలని నియోజకవర్గ స్థాయి నేతలు స్పష్టం చేస్తుండటంతో, ఎవరిని ఎంపిక చేస్తే అసమ్మతి లేకుండా ఉంటుందనే దానిపై మండల, పట్టణ స్థాయి సమీక్షలు ముమ్మరంగా సాగుతున్నాయి.

**సైలెంట్ ఆపరేషన్‌లో జనసేన..**
**పీఠంపై పవన్ పార్టీ గురి!**

మరోవైపు కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ రాజంపేట పీఠాన్ని అంత తేలిగ్గా వదిలేందుకు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో యువత, బీసీ వర్గాల మద్దతు పుష్కలంగా ఉందని భావిస్తున్న జనసేన శ్రేణులు.. కీలకమైన ఈ మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని తమకే కేటాయించాలని అంతర్గతంగా పట్టుబడుతున్నాయి. తమ వైపు నుంచి కూడా పోటీకి సమర్థులైన బీసీ మహిళా నాయకురాళు సిద్ధంగా ఉన్నారని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. బహిరంగ ప్రకటనలు చేయకుండానే తమ బలాన్ని అధిష్ఠానాల వద్ద నిరూపించుకునేందుకు జనసేన నాయకత్వం 'సైలెంట్ ఆపరేషన్' కొనసాగిస్తోంది.

**దోబూచులాడుతున్న 'వార్డు' ఈక్వేషన్లు!**

చైర్‌పర్సన్‌గా ఎవరిని నిలబెట్టాలన్నది తేలాలంటే.. ముందుగా సదరు అభ్యర్థి ఏ వార్డు నుంచి కౌన్సిలర్‌గా సునాయాసంగా గెలవగలరు అనేదే పెద్ద చిక్కుముడిగా మారింది.బలమైన బీసీ జనాభా ఉన్న వార్డుల్లో పోటీ చేసి గెలిస్తేనే చైర్‌పర్సన్ పీఠం దక్కుతుంది.

జనరల్ వార్డుల నుంచి బీసీ మహిళలను బరిలోకి దింపితే రిస్క్ ఎంతవరకు ఉంటుంది?

సొంత వార్డులో అసమ్మతి రగడ తలెత్తితే ఫలితం తారుమారయ్యే ప్రమాదం ఉందా? అన్న కోణాల్లో స్థానిక నేతలు సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

**చక్రం తిప్పుతున్న తెరవెనుక లాబీయింగ్!**

రిజర్వేషన్ ప్రకటన వెలువడిన క్షణం నుంచే ఆశావహుల మంతనాలు పతాక స్థాయికి చేరాయి. జిల్లా మంత్రులు, కీలక ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతల నివాసాల వద్ద ఆశావహులు క్యూ కడుతున్నారు. రాజంపేట అభివృద్ధికి నిధులు తెచ్చే పరపతి, కౌన్సిలర్లను ఏకతాటిపై నడిపించే సమర్థత ఉన్నవారికే బాధ్యతలు అప్పగిస్తారా లేక కూటమి పెద్దల మధ్య కుదిరే రాజకీయ సర్దుబాటే అంతిమ నిర్ణయమవుతుందా




అనేది పట్టణ ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కుర్చీ ఎవరిని వరిస్తుందో తేలేవరకు రాజంపేట వీధుల్లో ఈ ఉత్కంఠ కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

**జనసేన ఆఫీస్‌లో 'యల్లటూరు'తో సీక్రెట్ మంతనాలు..**
**పీఠం కోసం అమీతుమీ!**

రాజంపేట పురపాలక పీఠం దక్కించుకునేందుకు జనసేన పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే జనసేన పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజుతో రాజంపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు జరిపిన అంతర్గత మంతనాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాజంపేట పురపాలక సంఘంలో జనసేన పార్టీకి ఉన్న బలం, క్షేత్రస్థాయి పరిస్థితులు, బీసీ మహిళా రిజర్వేషన్ పరిణామాలపై నేతలు ఆయనతో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

**"ఈసారి చైర్‌పర్సన్ స్థానం మనకే దక్కాలి":**

రాజంపేటలో కూటమి గెలుపు కోసం జనసేన శ్రేణులు తీవ్రంగా శ్రమించాయని, బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకే కేటాయించేలా రాష్ట్ర అధిష్ఠానం వద్ద పట్టుబట్టాలని స్థానిక నాయకులు యల్లటూరును బలంగా కోరినట్లు తెలుస్తోంది.

**అధిష్ఠానానికి నివేదిక:**

రాజంపేటలో జనసేన తరఫున సమర్థులైన, ఆర్థిక-సామాజిక బలం ఉన్న బలమైన బీసీ మహిళా నాయకురాళ్ల జాబితాను, వార్డుల వారీ సమీకరణాలను సిద్ధం చేసి అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడానికి ఈ భేటీలోనే ప్రాథమిక ప్రణాళిక రచించినట్లు సమాచారం.

**టీడీపీకి ఝలక్ ఇచ్చేలా పక్కా స్కెచ్:**

టీడీపీ సైతం ఈ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని చూస్తున్న తరుణంలో, జనసేన పార్టీ కార్యాలయంలో యల్లటూరుతో జరిగిన ఈ ఆకస్మిక సమావేశం రాజంపేట రాజకీయాల్లో ఒక్కసారిగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పరిణామం అటు తెలుగుదేశం శిబిరంలో కూడా కొత్త టెన్షన్ మొదలుపెట్టింది.

## రాజంపేట మున్సిపల్ బరిలో విద్యావంతురాలైన యువ వైద్యురాలు

చైర్‌పర్సన్ రేసులో డాక్టర్ దొంతం గాయత్రి!

కూటమి తరపున అవకాశం కల్పిస్తే పోటీకి సిద్ధం

బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో తెరపైకి డాక్టర్ గాయత్రి పేరు

ప్రజాసేవ, పట్టణాభ్భృద్ధే ధ్యేయమంటూ ప్రజల ఆశీస్సులు కోరిన వైనం



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 13: రాజంపేట మున్సిపాలిటీ ఎన్నికల సమరం వేడెక్కుతున్న వేళ, స్థానిక రాజకీయాల్లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసు కుంది. మున్సిపల్ చైర్మన్ పదవి ఈసారి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో, ఉన్నత విద్యావంతురాలు, ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ దొంతం గాయత్రి తెరపైకి వచ్చారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే కూటమి అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆమె ప్రకటించారు.

**టీడీపీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న కుటుంబం**

డాక్టర్ దొంతం గాయత్రి... ప్రముఖ వ్యాపారవేత్త, అక్షర విద్యాసంస్థల అధినేత దొంతం శివప్రసాద్ (గంప శివ) కుమార్తె. వీరి కుటుంబం దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి విధేయులుగా ఉంటూ, పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో విశేష సేవలందిస్తోంది. సేవా దృక్పథం, విద్యా రంగంలో విశేష అనుభవం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ గాయత్రి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**విద్య, సేవా దృక్పథమే ఆయుధాలుగా...**

ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ, పట్టణ సమగ్ర అభివృద్ధికి సరికొత్త ప్రణాళికలతో ముందుకెళ్లడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. "ఉన్నత విద్యనభ్యసించిన ఒక యువతిగా రాజంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం నాకుంది. తెలుగుదేశం పార్టీ అధిష్టానం, కూటమి నాయకత్వం నాపై నమ్మకం ఉంచి ఆశీర్వదిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. పట్టణ ప్రజలు, ఓటర్లు, కూటమి శ్రేణులు నన్ను ఆశీర్వదించి సేవ చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని కోరుతున్నాను" అని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యావంతులైన యువత స్థానిక సంస్థల పాలనలోకి వస్తే పట్టణ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని, డాక్టర్ గాయత్రి రాకతో రాజంపేట మున్సిపల్ ఎన్నికల ముఖచిత్రం మరింత ఆసక్తికరంగా మారిందని స్థానిక వర్గాల్లో చర్చ సాగుతోంది.

## మంత్రి సవితమ్మను కలిసిన మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి

రాజంపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వానికి వినతి



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 13 కడప జిల్లా ఇన్‌ఛార్జ్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవితమ్మను రాజంపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన భర్త మల్లెల సురేంద్ర యాదవ్‌తో కలిసి మంత్రి నివాసానికి వెళ్లిన ఆమె, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాజంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ తన బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా మల్లెల శ్రీవాణి మాట్లాడుతూ, తాను గతంలో 2005 నుంచి 2010 వరకు రాజంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించి పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేశానని గుర్తుచేశారు. ఒక బీసీ మహిళగా ప్రజలకు మరింత నిబద్ధతతో సేవ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి వద్ద స్పష్టం చేశారు. పార్టీ తరఫున తన అభ్యర్థిత్వాన్ని సమగ్రంగా పరిశీలించేలా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజుతో పాటు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సిఫార్సు చేయాలని ఆమె మంత్రి సవితమ్మను కోరారు. ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే తనకు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మరోసారి అవకాశం కల్పించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.